క్లుప్తంగా

తాగునీరు రోడ్డు పాలు



ప్రగతినగర్ బతుకమ్మ ఘాట్ వద్ద వృథాగా పోతున్న తాగునీరు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లోని బతుకమ్మ ఘాట్ వద్ద సోమవారం మంజీర పైపులైన్ పగలడంతో తాగునీరు రోడ్డుపై ఏరులై పారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేల గ్యాలన్ల గోదావరి జలాలు వృథాగా పోయాయి. రోడ్డంతా చిత్తడిగా మారడంతో అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లీకేజీ విషయం తెలుసుకున్న జలమండలి అధికారుల నీటి సరఫరాను నిలిపివేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: బాచుపల్లి చౌరస్తాలో విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ శ్రీహోమ్స్, ఏసీ టైర్స్, మల్లంపేట్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

స్కూల్ లెడ్ మూవ్‌మెంట్ ర్యాలీ



ప్లకార్డులతో విద్యార్థుల అవగాహన ర్యాలీ

కుత్బుల్లాపూర్: స్కూల్ లెడ్ మూవ్‌మెంట్‌లో భాగంగా సోమవారం కుత్బుల్లాపూర్ డివిజన్‌కు చెందిన ఆర్ఎస్‌కే స్కూల్ విద్యార్థులు ప్రధాన అంశాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. చిన్నారులపై కుక్కల దాడి, వాయు కాలుష్యంతో ఏర్పడుతున్న దుష్పరిణామాలు, ప్లాస్టిక్ వాడకంపై నిషేధం వంటి అంశాలను ప్రజలకు వివరిస్తూ వాటి నివారణ మార్గాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కే స్కూల్ కో.ఆర్డినేటర్ శోభ, ఉపాధ్యాయులు ఉష, నిర్మల, దేవేంద్ర, సరిత, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సీటీపీ ప్లాంట్ ఏర్పాటుతో డంప్‌యార్డు దుర్వాసనకు చెక్



నర్సరీ కోసం ఏర్పాటు చేసిన స్థలం

జగద్గిరిగుట్ట: డంప్‌యార్డ్ మూలంగా ఒకప్పుడు హెచ్ఎంటీ పైప్‌లైన్ రోడ్డులో వెళ్లాలంటే ముక్కుమూసుకుని వాళ్లాల్సి వచ్చేది. 8 నెలల క్రితం అదే దేవమ్మ బస్తీని ఆనుకొని రాంకీ సంస్థ ఎస్‌సీటీపీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కరమైంది. ఇప్పుడు అదే డంప్‌యార్డ్ స్థలంలో జీహెచ్ఎంసీ వారు నర్సరీని ఏర్పాటు చేశారు. సుమారు రూ.41లక్షతో ప్రీ క్యాస్ట్ కంపౌండ్ వాల్ నిర్మాణం, గ్రావెల్ నింపడానికి మరో రూ.40లక్షలతో ఏర్పాట్లు పూర్తి చేశారు. కూకట్‌పల్లి జోన్‌కు సంబంధించిన సర్కిల్‌లు హరితహారంలో ఉపయోగించుటకు అనుగుణంగా విశాలమైన స్థలంలో ఈ నర్సరీ ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో ఈ దారిలో ఇప్పుడు ఎలాంటి దుర్వాసన రాకపోవడంతో వాహనదారులు, డంప్‌యార్డ్‌కు ఆనుకొని ఉన్న దేవమ్మబస్తీ, బీరప్ప నగర్ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడి మృతి



కుత్బుల్లాపూర్: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేట్‌బషీరాబాద్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో జాతీయ రహదారి–44పై సోమవారం ఉదయం ఓ వృద్ధుడి (60) రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టి వెళ్లడంతో తీవ్ర గాయాలైన వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి ఆచూకీ కోసం ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం వృద్ధుడి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

డ్రైనేజీపై నిర్మాణం.. దర్జాగా వ్యాపారం!



డ్రైనేజీపై షటర్లు వేసిన దృశ్యం

కుత్బుల్లాపూర్: గత మూడేళ్లుగా డ్రైనేజీ నిర్మాణంపై షట్టర్లు వేసి దర్జాగా వ్యాపారం కొనసాగిస్తున్నా సంబంధిత అధికారులు గుర్తించ లేకపోయారు.. నిత్యం ఇక్కడ డ్రైనేజీ జామ్ కాగా.. సిబ్బంది అక్కడికి వచ్చి తూతూ మంత్రంగా పనులు చేపట్టి వెళ్లడం పరిపాటిగా మారింది... అసలు లైను ఎక్కడి నుంచి ఉంది అన్న విషయంపై ఆరా తీయగా ఏకంగా 5 షటర్లు వేసి సుమారు 50 గజాల విస్తీర్ణాన్ని కలుపుకుని దర్జాగా వ్యాపారం చేస్తున్నారని గుర్తించి స్థానికులు అవాక్కయ్యారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని చెరుకుపల్లి ప్రతాపరెడ్డి కాలనీ(సీపీఆర్) ప్రధాన రోడ్డుపైనే ఈ విషయం వెలుగులోకి రావడం విశేషం.

మూడేళ్లుగా వ్యాపారం..

కుత్బుల్లాపూర్ గ్రామంలోని గ్రంథాలయం సమీపంలో మూడేళ్లుగా డ్రైనేజీ లైన్ వెళ్తున్న స్థలాన్ని ఆక్రమించి కొంతమంది వ్యక్తులు ఐదు షటర్లు వేసి వ్యాపారం కొనసాగిస్తూ వచ్చారు. ఈ విషయంపై అప్పట్లో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయగా కొంతమంది ఒత్తిడితో వెనక్కి వెళ్లిపోయారు. అయితే ఇక్కడ నివాసం ఉంటున్న ఇళ్లల్లో నిత్యం డ్రైనేజీ జామ్ కావడం ఆ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేయడం.. సిబ్బంది వచ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వెళ్లడం జరుగుతూ వచ్చింది. అయితే రోడ్డు స్థలం పక్కనే ఉన్న డ్రైనేజీని గుర్తించలేక అనేక ఇబ్బందులు పడ్డారు. తాజాగా ఈ విషయం వెలుగులోకి రావడంతో సర్కిల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు అన్న విషయంపై ఇప్పుడు ఆసక్తికర అందరూ ఎదురు చూస్తున్నారు.

సుమారు 30 లక్షలపై మాటే..

రోడ్డు పక్కనే ఉన్న డ్రైనేజీని కబ్జా చేసి వ్యాపారం చేస్తున్న ఆ స్థలం విలువ సుమారు గజానికి 60 వేల చొప్పున వేసుకుంటే 50 గజాలకు రూపాయలు 30 లక్షలకు పైగానే ధర పలుకుతుంది. అధికారులు డ్రైనేజీ నిర్మాణంపై చేపట్టిన వీటిని పరిశీలించి బాధ్యులపై కేసులు నమోదు చేయాల్సిన బాధ్యత ఉంది. ఆ నిర్మాణాలపై ఇప్పటికే పలువురు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. కుత్బుల్లాపూర్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకొని పక్షంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ విజిలెన్స్ విభాగం అధికారులకు ఫిర్యాదు చేసేందుకు స్థానికులు సన్నద్ధం అవుతున్నారు. ఇదే విషయంపై టౌన్ ప్లానింగ్ అధికారి పద్మావతిని ‘సాక్షి’ వివరణ కోరగా తప్పకుండా ఇంజినీరింగ్ అధికారులతో సర్వే చేయించి డ్రైనేజీ నిర్మాణంపై కట్టడాలు ఉంటే మాత్రం తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనిస్తోంది

ప్రగతియాత్రలో ఎమ్మెల్యే వివేకానంద్



బీహెచ్ఈఎల్ విస్టా కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతి యాత్రలో భాగంగా సోమవారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని బీహెచ్ఈఎల్ విస్టా కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు సీసీ రోడ్లు, కమిటీ హాలు, పారిశుద్ధ్య నిర్వహణ, పందుల బెడద తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకుని దశల వారీగా అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగు పరుస్తున్నామని పేర్కొన్నారు. ఏఈలు నాగేశ్వర్‌రావు, సురేందర్ నాయక్, మేనేజర్ రాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్దిరాములు, నదీమ్ రాయ్, కాలనీ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ టాలెంట్ సెర్చ్‌లో సత్తాచాటిన బచ్‌పన్



పతకాలు సాధించిన విద్యార్థులతో స్కూల్ డైరెక్టర్ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: ఎయిమ్స్ టాలెంట్ సెర్చ్ పరీక్ష లెవల్–2లో చింతల్ వెంకటేశ్వరనగర్‌కు చెందిన బచ్‌పన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 3వ తరగతి విద్యార్థులు సీహెచ్ రుత్విక్, సాయిశ్రీమాన్‌లు జాతీయ స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించారు. 4వ తరగతికి చెందిన ఎస్.సాయి, సాత్విక్‌ల ప్రాంతీయ స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచి రజిత పతకాన్ని, దక్ష, ఉమేష్, భాస్కర్ మండల తృతీయ స్థానంలో కాంస్య పతకాన్ని, 5వ తరగతి నుంచి ఎస్.ప్రతీష్ ప్రాంతీయ తృతీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని, 6వ తరగతికు చెందిన డి.సాయి తనూజ్ మండల తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని పొందారు. సోమవారం బచ్‌పన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ టి.కోటిరెడ్డి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి



కళ్లద్దాలను అందజేస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: పేదల కళ్ల సమస్యలను దూరం చేసేందుకే ప్రభుత్వం కంటివెలుగును ప్రవేశపెట్టిందని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ రామకృష్ణరావుతో కలిసి సోమవారం మేయర్ ఇందిరమ్మకాలనీ ఫేజ్–2లోని బస్తీ దవాఖానాలోని కంటివెలుగు కేంద్రాన్ని సందర్శించారు. ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ తాత్సారంతో కాలనీవాసులకు ఇబ్బందులు



రంగారెడ్డినగర్: రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ చేస్తున్న తాత్సారంతో ఆ ప్రాంత వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని విజయ్‌నగర్ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డులో మూడు నెలల క్రితం భూగర్భ డ్రైనేజీ లైన్ పనులు పూర్తి చేశారు. అయితే ప్యాచ్ వర్క్‌లు చేపట్టకపోవడంతో ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల సదరు కాంట్రాక్టర్‌తో పనులు చేపట్టారు. అయితే రోడ్డు తవ్వి తర్వాత పత్తా లేకుండా పోయాడు. దీనికి తోడు ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో కనీసం నడవడానికి వీలు లేకుండా రోడ్డు మారిందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విజయ్‌నగర్‌కాలనీ వాసులు కోరుతున్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం షురూ



అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుతున్న శిక్షకులు



ప్రోగ్రాంలో పాల్గొన్న అధ్యాపకులు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (వీఎన్ఆర్ వీజేఐఈటీ) కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ఇన్‌స్ట్రక్షనల్ డిజైన్ అండ్ డెలివరీ సిస్టమ్స్ అంశంపై వారం రోజుల పాటు జరిగే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. ఈ ఆరంభ కార్యక్రమంలో ఎన్ఐటీటీటీఆర్ శిక్షకులు, కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ సీడీ నాయుడు, సంచాలకులు డాక్టర్ చెన్నకేశవరావు, హెచ్అండ్ఎస్ విభాగాధిపతి డాక్టర్ జయశ్రీలు పాల్గొన్నారు.

◆ సుమారు 40 మంది అధ్యాపకులకు శిక్షణలో భాగంగా బోధనలో మెలకువలు నేర్పించారు. విద్యార్థులకు పాఠాలు సరిగా అర్థమవుతుందో లేదో ఎలా తెలుసుకోవాలనేదానిపై అవగాహన కల్పించారు. ప్రశ్నాపత్రాలను ప్రభావశీలంగా రూపొందించడంపై వివరించారు. ఎన్ఐటీటీటీఆర్ కోర్స్ కోఆర్డినేటర్, ఎక్స్‌టెన్షన్ కేంద్రం విభాధిపతి డాక్టర్ ఉమాశంకర్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ షణ్ముగనిధి, డాక్టర్ జనార్దన్‌లు శిక్షకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీడీ నాయుడు మాట్లాడుతూ... కొత్తగా అధ్యాపక వృత్తి చేపట్టిన యువతతో పాటు అనుభజ్ఞులైన అధ్యాపక సిబ్బంది సైతం ఈ శిక్షణలో నూతన బోధనా పద్ధతుల మెలకువలను నేర్చుకునే వీలు కలుగుతుందన్నారు.

నేడు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష

కూకట్‌పల్లి: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌కు నిరసనగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపడుతున్నామని కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం నుంచి ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి బయలేదరుతామని పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని దీక్షను జయప్రదం చేయాలన్నారు.

నేడు ‘మనూ’లో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ సయ్యద్ అస్మత్‌జహాన్ తెలిపారు. సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ ఉర్దూ, పర్షియన్ విమర్శకుడు డా.సయ్యద్ తకీ అబేదీ పాల్గొంటారన్నారు.

నేడు ప్రపంచ నీటి దినోత్సవం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని (డబ్లుడబ్ల్యూడీ)పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలను మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. క్యాంపస్‌లోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నీటిపై డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రదర్శించడానికి కూడా ఏర్పాట్లు చేశారు. మనూ జల్‌శక్తి అభియాన్ స్కూల్ ఆఫ్ సైన్సెస్ చైర్మన్ ప్రొఫెసర్ షకీల్ అహ్మద్‌ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి వైస్‌చాన్స్‌లర్ ప్రొ.సయ్యద్ ఐనుల్‌హసన్ ప్రారంభిస్తారు.

టీవీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

కంటోన్మెంట్: రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్ట పరమైన రక్షణలు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ వికాస సమితి (టీవీఎస్) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జరిగిన తెలంగాణ వికాస సమితి జిల్లా కార్యకర్తల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బోయిన్‌పల్లికి చెందిన వెంకటేశ్వర్లు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ పరమైన హక్కులు పౌరులందరూ వినియోగించుకునేలా తన వంతు ప్రయత్నాలు చేస్తానన్నారు.

‘తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..’

చింతల్: తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ప్రజల ఇబ్బందులు తొలగనున్నామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం ఆయన చింతల్ డివిజన్ పరిధిలోని రోడామేస్త్రీనగర్, వల్లభాయ్‌పటేల్‌నగర్, తమిళ్‌నగర్ ప్రాంతాల్లో కాంగ్రెస్ జెండాలు ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తమకు మద్దతు తెలపాలని కోరుతూ కరపత్రాలు అందజేశారు.

◆ ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వారికి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్‌కుమార్, ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షులు ఆవిజె జేమ్స్, పండరీరావు, నారాయణరెడ్డి, నాగరాజు, బాలు, హనుమంత్, చెల్మరెడ్డి, మాజీ వార్డు మెంబర్ గణేష్, ఎండీ అంజద్, ఎండీ నయీమ్, రహీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణతో ఓల్డ్ బోయిన్‌పల్లికి మహర్దశ

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ఎట్టకేలకు రోడ్డు విస్తరణకు మార్గం సుగమం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ ప్రధాన రహదారి ఎన్‌హెచ్ 44కు, సికింద్రాబాద్, రాజీవ్ రహదారితో పాటు ముంబాయి హైవేకు అనుసంధానంగా ఉండటంతో విస్తరణ పనులు చేపట్టామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లను కోల్పోతున్న బాధితులకు సోమవారం ఆయన కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి నష్టపరిహారం కింద (టీడీఆర్) చెక్కులను పంపిణీ చేశారు. పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు చెక్ పడటంతో పాటు, స్థానిక వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. ఇళ్లను కోల్పోతున్న వారికి తక్షణమే నష్టపరిహారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఇర్షాద్, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, ఇర్ఫాన్, మేకల హరినాథ్, బుర్రి యాదగిరి, మేక ఉదయ్, పోచయ్య, సలీం, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీబాటలో ప్రజావసరాలను తెలుసుకుంటున్నాం

జీడిమెట్ల: బస్తీబాట కార్యక్రమం ద్వారా ప్రజలు అవసరాలు తెసుకుంటున్నామని బీఆర్ఎస్ నాయకులు గుడిమెట్ల సురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన సుభాష్‌నగర్ డివిజన్‌లోని కృషికాలనీ, పుష్పగిరి కాలనీల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను సురేష్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలు పరిష్కరింపజేస్తామన్నారు. అదే విధంగా పనులకు అవసరమైన బడ్జెట్‌ను అధికారులతో ఎస్టిమేట్ చేయించారు. ఈ కార్యక్రమంలో సురేష్‌రెడ్డితో పాటు శానిటేషన్ అధికారులు, జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులు, కాలనీ కమిటీ అధ్యక్షులు బైరేష్, వెంకటరెడిడ, సజ్జుబాయ్, కృష్ణ, సత్యనారాయణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి, శివాజీ,వినయ్ స్థానికులు పాల్గొన్నారు.

కార్మికులకు సూపర్‌మ్యాక్స్ కంపెనీ జీతాలు చెల్లించాలి



షాపూర్‌నగర్ సాగర్ హోటల్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాలు

రంగారెడ్డినగర్: జీడిమెట్ల పారిశ్రామికవాడలోని సూపర్ మ్యాక్స్ కంపెనీ కార్మికులకు జీతాలు చెల్లించాలంటూ సోమవారం షాపూర్‌నగర్‌లోని సాగర్ హోటల్ వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కీలుకాని లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఉమామహేష్ మాట్లాడారు. సూపర్ మ్యాక్స్ కంపెనీ యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడి వెంటనే ఉత్పత్తి ప్రారంభించాన్నారు. అదే విధంగా 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ యాజమాన్యం దిగి రాకుంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బీరప్ప, దేవదానం, ఏఐటీయూసీ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి స్వామి, శ్రీనివాస్, కంపెనీ యూనియన్ జనరల్ సెక్రటరీ ఐఎస్‌రావు, ఈశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం జీడిమెట్లలోని సరోజిని గార్డెన్స్‌లో రామిడి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్, మాజీ మంత్రి కృష్ణయాదవ్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. స్థానిక యువకులతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తుల ఉమ, ఎస్.మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శులు గరిగే శేఖర్ ముదిరాజ్, భరతసింహారెడ్డి, నాయకులు సత్యనారాయణ, బాలప్ప, వెంకట్, రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల నుంచి డీజిల్ తస్కరణ

దుండిగల్: ఆర్టీసీ బస్సుల నుంచి డీజిల్‌ను తస్కరించిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ డిపో–2లో ఆర్టీసీ డ్రైవర్లుగా పని చేస్తున్న చంద్రశేఖర్, లక్ష్మయ్య ఆదివారం రాత్రి మల్లంపేట్‌లోని టెంపుల్ సమీపంలో బస్సులను నిలిపారు. సోమవారం ఉదయం బస్సులు స్టార్ట్ కాకపోవడంతో సదరు డ్రైవర్లు డీజిల్ ట్యాంక్‌లను పరిశీలించగా డీజిల్ మొత్తం ఖాళీ అయ్యింది. మొత్తం 200 లీటర్ల డీజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు సోమవారం డ్రైవర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేపర్ లీక్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్
- గండిమైసమ్మ చౌరస్తాలో నిరసన దీక్ష
- మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్



నిరసన దీక్షలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల: నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపు మేరకు గండిమైసమ్మ చౌరస్తాలో నిరసన దీక్ష చేపట్టారు. అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాము ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష కార్యక్రమానికి బీజేపీ నాయకుల పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే మంత్రి కేటీఆర్‌ను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సవాల్ విసిరారు.

నోటిఫికేషన్లు ఇచ్చి కేసులు వేయించిన ఏకైక ప్రభుత్వం

◆ గడిచిన తొమ్మిదేళ్లలో ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేసినట్టుగానే వేసి వెంటనే దొంగచాటున కోర్టులో కేసులు వేయించిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని ఆరోపించారు. నిధులు, నియామకాల పేరుతో ఏర్పడిన తెలంగాణలో నీళ్లు లేవు, నిధులు లేవు అని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంటే కేసీఆర్ కుటుంబీకులు మాత్రం పదవవులు, ధన దాహంతో ధనవంతులు అయ్యారని ఆరోపించారు.

◆ **విద్యార్థుల ఉసురు ప్రభుత్వానికి తగులుతుంది..**

కొన్ని ఏళ్లుగా బంగారం, పొలాలు తాకట్టు పెట్టి పిల్లలను చదివించిన గ్రామీణ పేద విద్యార్థుల శాపం బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగులుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్ల పరిస్థితి గాలిలో దీపంలా ఉందని విమర్శించారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణ రాష్ట్రాన్ని నిండా ముంచిందని ఆరోపించారు. పేపర్ లీకేజీ బండారం బయటపడటంతో బీఆర్ఎస్ నాయకులు నోళ్లు మూతపడ్డాయని అన్నారు. ఇదంతా తెలంగాణ సమాజం గమనిస్తోందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మంచి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

క్యూ న్యూస్‌పై దాడి పిరికిపంద చర్య

◆ తీన్మార్ మల్లన్న క్యూన్యూస్ కార్యాలయంపై దాడిని ఈ సందర్భంగా ఆయన ఖండించారు. ఇది బుద్ధిలేని పిరికిపంద చర్య అని అన్నారు. దీక్షలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎస్.మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు గరిగె శేఖర్, రాజిరెడ్డి, బావిగడ్డ రవి, శేఖర్‌యాదవ్, సురేష్‌రెడ్డి, ఆకుల సతీష్, జనార్దన్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, అర్కల సుధా, సరిత, దాసరి శ్యాంరావ్, రాంచందర్ నాయక్, దాసి నాగరాజు, సుమన్‌రావు తదితరులు పాల్గొన్నారు.